# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 31-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సమాజానికి మెరుగైన ఆరోగ్య సంరక్షణా సౌకర్యాలను అందించేందుకు యువ వైద్యులు కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు.
- ❖ ఉభయ సభల్లో గందరగోళం నెలకొనడంతో పార్లమెంట్ సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన కోసం 6,520 కోట్ల రూపాయల వ్యయాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.
- ❖ అమెరికా విధించిన సుంకాల ప్రకటనలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని కేంద్రమంత్రి పియూష్ గోయల్ తెలిపారు.
- ❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య చివరి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో ఈ రోజు వర్షం కారణంగా ఆటకు అంతరాయం ఏర్పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజానికి మెరుగైన ఆరోగ్య సంరక్షణా సౌకర్యాలను అందించేందుకు యువ వైద్యులు కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు. జార్ఖండ్ లోని డియోఘర్ జిల్లాలో ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) స్నాతకోత్సవంలో ఈ రోజు రాష్ట్రపతి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎయిమ్స్ ఏర్పాటుతో స్థానికంగా గిరిజనులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుతున్నాయని చెప్పారు. అదే విధంగా ఐదు గిరిజన గ్రామాలను ఎయిమ్స్ దత్తత తీసుకున్నందుకు రాష్ట్రపతి ప్రశంసించారు. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఉభయ సభల్లో గందరగోళం నెలకొనడంతో సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణలపై చర్చ చేపట్టాలని కోరుతూ విపక్షాలు పట్టుబట్టడంతో ఈరోజు ఉభయ సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్ సభ సమావేశమైనప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి NISAR ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అంతరిక్ష శాస్త్రవేత్తలను అభినందించారు. అనంతరం స్పీకర్ ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టడానికి ప్రయత్నించినా సభ్యుల ఆందోళనల మధ్య ఫలించలేదు. రాజ్యసభలో కూడా ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య పలు మార్లు సభ వాయిదా పడింది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ వివిధ అంశాలపై రాజకీయ పార్టీల నుండి వచ్చిన వాయిదా నోటీసులను తిరస్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన కోసం 1,920 కోట్ల రూపాయల అదనపు వ్యయంతో సహా మొత్తం 6,520 కోట్ల రూపాయల వ్యయాన్ని కేంద్ర మంత్రివర్గం ఈ రోజు ఆమోదించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నుండి 2028-29 వరకు 4 సంవత్సరాల కాలానికి 2 వేల కోట్ల రూపాయలను జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (NCDC)కి మంజూరు చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అదే విధంగా ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలలోని 13 జిల్లాల పరిధిలో నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులను ఆమోదించిందని తెలిపారు. ఇది భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్‌ను దాదాపు 574 కిలో మీటర్ల మేర పెంచుతుందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) న్యాయస్థానం మాలేగాం పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురినీ నిర్దోషులుగా ప్రకటించింది. ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ ఏకే లాహోటి ఈ రోజు తీర్పును వెలువరించారు. 2008లో జరిగిన ఈ దారుణ ఘటనలో ఆరుగురు మరణించగా, వంద మందికి పైగా గాయపడ్డారు. అనుమానాల ఆధారంగా కేసును ముందుకు తీసుకెళ్లలేమని, నిందితులకు వ్యతిరేకంగా ఉన్న ఆరోపణలపై సహేతుకమైన సాక్ష్యాధారాలను సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని న్యాయమూర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాలెగాం పేలుళ్ల ఘటన అత్యంత తీవ్రమైన అంశమని, నైతికత అనే ప్రాతిపదికన కోర్టు ఎవరినీ శిక్షించబోదని ఆయన వ్యాఖ్యానించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల ప్రకటనలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఈ విషయంలో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఇటీవల భారత్ పై విధించిన సుంకాల అంశంపై లోక్ సభలో కేంద్రమంత్రి ఈ రోజు వివరణ ఇచ్చారు. అమెరికా విధించిన సుంకాల పర్యవసానాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని, భారత్ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలు, చిన్న పరిశ్రమలు, రైతులు, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పియూష్ గోయల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం ఎలక్టోరల్ కాలేజీ జాబితాను ఖరారు చేస్తూ... కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు ఒక ప్రకటన చేసింది. ఉప రాష్ట్రపతిని ఎలక్టోరల్ కాలేజ్‌లో సభ్యులుగా ఉన్న రాజ్యసభ సభ్యులు, లోక్ సభ సభ్యులు, రాజ్యసభకు నామినేట్ అయిన ఎంపీలు ఎన్నుకుంటారు. ఎలక్టోరల్ కాలేజీ సభ్యుల జాబితా వారి వారి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన అక్షర క్రమంలో ఉంటాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం భారత ఉప రాష్ట్రపతి ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఈ రోజు ఉదయం భూమి స్వల్పంగా కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.3గా నమోదయ్యిందని సెస్మోలాజికల్ పరిశోధన సంస్థ (ISR) ప్రకటించింది. భూకంపం ఉదయం 9 గంటల 52 నిమిషాలకు సంభవించిందని పేర్కొంది. కచ్ జిల్లాలోని బేలాకు నైరుతి దిశలో 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు ఐఎస్ఆర్ తెలిపింది. ఈ స్వల్ప భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని జిల్లా విపత్తుల నిర్వహణ అధికారి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిన్నజీయర్ స్వామి ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈ రోజు కలిశారు. ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం 3వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది చివరలో నిర్వహించే ముగింపు వేడుకలకు విశిష్ఠ అతిథిగా హాజరు కావాలని ప్రధానమంత్రిని ఆయన ఆహ్వానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్‌సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య చివరి టెస్ట్ మ్యాచ్ లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటి వరకూ 3 వికెట్ల నష్టపోయి 83 పరుగులు చేసింది. కాగా భోజన విరామ సమయం అనంతరం ఆట ప్రారంభించినప్పటికీ పలు మార్లు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాది రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం వల్ల పలు రహదారులు దిగ్బంధనానికి గురయ్యాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కరిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. రాజస్థాన్‌లో వచ్చే 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ముఖ్యంగా అజ్మీర్, జయ్‌పూర్, బికనీర్, జోధ్‌పూర్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =